www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
ఆదివారం
11 మే 2025

## విలేఖరులు కావలెను

కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రిబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003



# పాక్ వక్రబుద్ధి

## కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన

## కుదిరిన మూడు గంటల్లోనే తూట్లు

- ఉల్లంఘన దుర్మార్గం : విక్రమ్ మిస్రీ
- బలగాలకు పూర్తి స్వేచ్ఛ
- ఆర్టిలరీ గన్స్, డ్రోన్లతో దాడులు
- జమ్ము కశ్మీర్, గుజరాత్ ల్లో 11 చోట్ల డ్రోన్లు
- తిప్పి కొట్టిన భారత బలగాలు
- శ్రీనగర్ లో పేలుళ్లు వినిపిస్తున్నాయన్న సీఎం ఒమర్
- పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్ము కశ్మీర్ లో బ్లాక్ అవుట్
- అమెరికా మధ్యవర్తిత్వంలో అంగీకరించిన భారత్
- ఇరు దేశాల కంటే ముందే ట్రంప్ ప్రకటన
- రేపు చర్చలు నిర్వహించనున్నట్టు వెల్లడి
- భారత్ డీజీఎంఓకు పాక్ డీజీఎంఓ ఫోన్
- ఏ ఉగ్రచర్య జరిగినా యుద్ధమే: భారత్

కలంజ్యోతి ప్రతినిధి : భారత్ తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మూడు గంటల్లోనే పాకిస్థాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. సరిహద్దు సమీపంలోని అఖ్నూర్, రాజౌరి, ఆర్ఎస్ పురా సెక్టార్, కచ్ , బారాముల్లా ల నుంచి ఫిరంగులతో దాడులకు తెగబడింది. జమ్మూ కశ్మీర్లోని రాజౌరి సెక్టార్, శ్రీనగర్, ఉత్తర కశ్మీర్లోని బారాముల్లా, రాజస్థాన్ లో ఫోఖ్రాన్ లపై పాక్ డ్రోన్ల తో దాడికి యత్నించింది. కానీ, భారత బలగాలు వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టాయి. కొన్ని డ్రోన్లను కూల్చివేయగా.. మరి కొన్నితిరిగి పాక్ కు వెళ్లినట్టు సమాచారం. శ్రీనగర్లో కాల్పుల శబ్దాలు వినిపిస్తునట్లు జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ట్వీట్ చేశారు. దానికి సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. ఆ వీడియోలో డ్రోన్లు శ్రీనగర్ గగనతలంపై ఎగురుతున్నట్టు చాలా స్పష్టంగా కనిపించింది. శ్రీనగర్లో 45 చోట్ల పేలుళ్ల శబ్దాలు కూడా వినిపించాయని ఆయన తెలిపారు. శ్రీనగర్, పఠాన్ కోట్ , రాజస్థాన్ సరిహద్దుల్లో బర్మేయర్, జైసల్మేర్, ఫోఖ్రాన్ లపై వైపు భారీ సంఖ్యలో డ్రోన్లు దూసుకొచ్చాయి. భారత్ వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఆ ప్రాంతాల్లో

మిగతా 2లో



కలంజ్యోతి
ఆదివారం 11.05.2025 General News





# పాక్ వక్రబుద్ధి

## కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘన



మొదటిపేజీ తరువాయి

బ్లాక్ అవుట్ ప్రకటించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు బ్లాక్ అవుట్ పాటించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ, ఈ దాడులపై భారత ప్రభుత్వం, భద్రతా దళాల నుంచి ఎలాంటి అధికారిక సమాచారం అందలేదు. జమ్ములోని పలన్వాలా సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి పాకిస్థాన్ కాల్పుల విరమణను ఉల్లంఘించింది. ఎల్‌ఓసీ వెంబడి పాక్ సైన్యం ఆర్టిలరీ గన్స్, డ్రోన్లతో భారత బలగాల స్థావరాలే టార్గెట్‌గా దాడులకు తెగబడింది. వీటిని కూడా భారత్ తిప్పి కొట్టింది. పాక్ సైన్యం చేస్తున్న దాడులతో అప్రమత్తమైన భారత్ సరిహద్దులోని రాజస్థాన్, గుజరాత్, పంజాబ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో బ్లాక్ అవుట్ విధించింది. గుజరాత్ లోని కచ్, రాజస్థాన్ లోని జై సల్మేర్, బార్మేయర్, జమ్ములోని శ్రీనగర్, అఖ్నూర్, రాజౌరి, ఆర్‌ఎస్ పురా సెక్టార్, బారాముల్లా, పంజాబ్ లోని అమృత్ సర్ సహా పలు ప్రాంతాల్లో పలు ప్రాంతాల్లో బ్లాక్ అవుట్ విధించారు.

### ఉల్లంఘన దుర్మార్గం: విక్రమ్ మిస్రీ

పాక్ కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించడం దుర్మార్గమని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు. పై శనివారం అర్ధరాత్రి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఎల్‌ఓసీ వెంబడి పాక్ కాల్పులకు పాల్పడిందని తెలిపారు. సరిహద్దు ప్రాంతాలపై డ్రోన్లతో దాడులకు ప్రయత్నించిందని వెల్లడించారు. ఉల్లంఘనలపై దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టు ప్రకటించారు. పరిణామాలను ఆర్మీ నిశితంగా గమనిస్తున్నదని తెలిపారు. షెల్లింగ్స్, మోటార్ షెల్స్ తో భారత బలగాలను టార్గెట్ చేయడం సమంజసం కాదన్నారు. డీజీఎంవో ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ అవగాహనను ఉల్లంఘించడం సరికాదని అభిప్రాయపడ్డారు. సైనికులు కాల్పుల విరమణ ఒప్పందం జరపకుండా పాకిస్థాన్ చర్యలు తీసుకోవాలి. దానికి పాక్ ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలన్నారు.

### అమెరికా మధ్యవర్తిత్వంతో అంగీకరించిన భారత్..

అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ మధ్యవర్తిత్వంతో ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ మేరకు తన ట్రూత్ సోషల్‌లో శనివారం సాయంత్రం ఓ పోస్ట్ పెట్టారు. 'అమెరికా మధ్యవర్తిత్వంలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. తక్షణమే కాల్పుల విరమణ చేపట్టేందుకు భారత్, పాక్ అంగీరించాయి. సరైన సమయంలో ఇరు దేశాలు విజ్ఞతతో, తెలివిగా వ్యవహరించాయి. అందుకు ధన్యవాదాలు'అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ విషయాన్ని భారత్, పాక్ వేర్వేరు ప్రకటనల్లో ధ్రువీకరించాయి. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణ అమలులోకి వచ్చినట్టు ఇరు దేశాలు వెల్లడించాయి. ఈ మేరకు శనివారం సాయంత్రం భారత్ - పాక్ కాల్పుల విరమణకు అంగీకరించాయని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ప్రకటించారు. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాలసైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5 గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరు దేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారు'అని మిస్రీ చెప్పారు. చర్చలు ఏ ప్రదేశంలో జరుగుతాయనేది నిర్ణయం తీసుకోలేదన్నారు. నేడు సమావేశ వేదికపై స్పష్టత రానున్నట్టు వెల్లడించారు.



### ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదు : జైశంకర్

ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారదని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఉగ్రవాదంపై దృఢంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి భారతదేశం- పాకిస్తాన్ మధ్య ఒప్పందం కుదిరింది. అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన కాల్పుల విరమణను ఆయన ప్రస్తావించారు. అన్ని సైనిక చర్యలను నిలిపివేయడానికి భారత్, పాకిస్థాన్ ఒక అవగాహనకు వచ్చాయని ఎస్ జైశంకర్ తెలిపారు. అలాగే ఉగ్రవాదంపై వైఖరికి భారత్ రాజీపడబోదని అన్నారు. 'భారత్, పాకిస్థాన్ దేశాలు కాల్పుల విమరణ, సైనిక చర్యపై ఒక అవగాహన కుదుర్చుకున్నాయి. అన్ని రూపాలు, వ్యక్తీకరణలలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢమైన, రాజీలేని వైఖరిని భారత్ నిరంతరం కొనసాగిస్తుంది. ఇది అలాగే కొనసాగుతుంది' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

### 48 గంటలు శ్రమించాం : మార్కోరుబియో

కాల్పుల విరమణ పై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో స్పందించారు. గత 48 గంటలుగా తనతో పాటు వీపీ వాన్స్ భారత్, పాక్ దేశాల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఈ చర్చల్లో ఇరు దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, షహబాజ్ షరీఫ్, భారత విదేశాంగ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, పాక్ సైన్యాధిపతి ఆసీమ్ మునీర్, రెండు దేశాల జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ దోవల్, అసిమ్ మాలిక్ సహ ఇరు దేశాల సీనియర్లు పాల్గొన్నారని చెప్పారు. అలాగే చర్చల్లో భారత్, పాక్ ప్రభుత్వాలు తక్షణ కాల్పుల విరమణ, శాంతి చర్చలకు అంగీకారం తెలిపాయని ప్రకటించడానికి సంతోషిస్తున్నానని అన్నారు. అంతేగాక ఈ సమయంలో శాంతి మార్గాన్ని ఎంచుకోవడంతో ప్రధానులు మోదీ, షరీఫ్ ల జ్ఞానం, వివేకం, రాజనీతిజ్ఞతను అభినందించారు. ఇక ఈ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ, సైనిక చర్యలను ఆపాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పాక్ డీజీఎంఓ ఈ చర్యను ప్రారంభించారని, ఆ తర్వాత చర్చలు జరిగి, ఇరు దేశాలు అవగాహనకు వచ్చాయని రూబియో చెప్పారు.

### ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తాం: భారత్

ఒప్పందం కుదిరే వేళ భారత్ పాకిస్తాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణిస్తామని హెచ్చరించింది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు మించిన ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు. భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారుజామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. అనంతరం నేపథ్యంలో మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధ చర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గతా భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ ఇచ్చినట్లయింది.

# రియల్ వలలో ఫారెస్ట్ ఉద్యోగి?

- చుంచుపల్లి మండలంలో అక్రమ వెంచర్
- గ్రామీణ ప్రాంతాలను వదలని ఎస్టేట్ వ్యాపారం
- పట్టించుకోని పంచాయతీ ఉన్నత అధికారులు


**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏర్పడిన తర్వాత కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లి మండలంలో రియల్ ఎస్టేట్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం కొనసాగుతుంది. చుంచుపల్లి మండలం శరవేగంగ అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ముఖ్యంగా నందతండా గ్రామపంచాయతీ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్న ఫారెస్ట్ ఉద్యోగి ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం అడ్డు అదుపు లేకుండా పోతుంది.

**గిరిజన చట్టాలకు తూట్లు..**

గిరిజన రక్షణ చట్టాలైన 1/70 చట్టం,1/59 చట్టం, పీసా చట్టాలను సైతం లెక్కచేయకుండా కొంతమంది ఫారెస్ట్ ఉద్యోగులు సిండికేట్ గా ఏర్పడి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు జిల్లాలో ఉన్న పట్టణ పరిసర ప్రాంతాలకు పరిమితమైన రియల్ ఎస్టేట్ వ్యాపారం క్రమక్రమంగా గ్రామాలకు పాకింది. దీంతో పంటలు పండించాల్సిన వ్యవసాయ భూములను ప్లాట్లుగా మారిపోతున్నాయి.

**అనుమతులు తప్పనిసరి..**

వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించాలంటే ప్రభుత్వం దగ్గర నుంచి అనుమతులు తప్పనిసరిగా పొంది ఉండాలి. అగ్రికల్చర్ వ్యవసాయ భూములను నాన్ అగ్రికల్చర్ వ్యవసాయ భూములగా రెవెన్యూ ఉన్నత అధికారుల దగ్గర మార్చాలి. జిల్లా యంత్రాంగం, ఆర్డీవో పరిధిలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులను చెల్లించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలి. నాలా పర్మిషన్ రోడ్డు నిర్మాణం సైడ్ డ్రైనేజీ కాల్వలు విద్యుత్ లైను తాగునీటి నల్లాలు గ్రీన్ ల్యాండ్ తదితర మౌలిక వసతులు కల్పించాలని నియమ నిబంధనలు ఉన్నప్పటికీ ఆ చట్టాలను పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అగ్రికల్చర్ భూములు, నాన్ అగ్రికల్చర్ భూములుగా మార్చకుండా ఇష్ట రాజ్యాంగ వెంచర్లు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి రియల్ ఎస్టేట్ దందాను అడ్డుకట్ట వేయాలని ఏజెన్సీ చట్టాలను కాపాడాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.






## 'దృష్టిరథం' ప్రారంభం

### కంటి సమస్యలపై అవగాహణకు ప్రత్యేక కార్యక్రమం

**కలంజ్యోతి, భీమదేవరపల్లి :** అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ ఆప్తమాలజీ ఆఫ్ ఇండియా (అకాయన్) తెలంగాణ శాఖ, శరత్ మ్యాక్స్ విజన్, ములుకనూరు సొసైటీ సంయుక్తంగా కంటి సమస్యలపై అవగాహణ కల్పించేందుకు 'దృష్టిరథం'ను శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో అకాయన్ కార్యదర్శి డాక్టర్ స్వఫన్ సమంతా, అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ ములుకనూరు, కొత్తకొండలలోని విజన్ సెంటర్ల సేవలను ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.





## కొండగట్టులో పోటెత్తిన భక్తులు

**కలంజ్యోతి, మల్యాల :** కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు ప్రాంగణము కళ్యాణ కట్ట పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు . అర్చకులు స్వామివారికి అభిషేకం,పూజలు నిర్వహించిన అనంతరం మూలవిరాట్ ను ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు తామెత్తు బంగారం (బెల్లం) స్వామివారికి సమర్పించి తీర్చుకున్నారు. సుమారు 20వేల మందికి పైగా స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## జవాన్ల కోసం నెల జీతం



**కలంజ్యోతి, మల్యాల :** భారతదేశ సరిహద్దులలోని సైనికుల కోసం తన ఒక్క నెల వేతనాన్ని విరాళంగా అందజేస్తున్నానని చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. భారత్ పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో దేశ రక్షణకు విరోచితంగా పోరాడుతున్న భారతదేశ సైనికులకు కృతజ్ఞతగా.. సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు నేషనల్ డిఫెన్స్ ఫండ్ కి తన ఒక్క నెల వేతనాన్ని అందజేస్తున్నామని సత్యం తెలిపారు.



## వర్గీకరణతోనే ఎస్సీ ఉప కులాలకు లబ్ధి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**కలంజ్యోతి, జగిత్యాల :** ఎస్సీ వర్గీకరణతో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత శాసనసభలో చట్టపరంగా చేసి వర్గీకరణ ఫలాలు మాదిగ ఉప కులాలకు అందే విధంగా చేయడంలో రాష్ట్ర మంత్రి వర్యులు రాజనర్సింహ కీలకంగా వ్యవహరించారనీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రం లోని స్థానిక మెడికల్ కాలేజీ గెస్ట్ హౌసులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాత్రికేయ సమావేశం ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగలకు మరియు ఉపకులాలకు తీవ్ర నష్టం వాటిల్లిందనీ, ప్రస్తుతం మన దేశం పాకిస్తాన్తో యుద్ధం చేస్తుందని, ఈ క్లిష్ట సమయంలో మన భారత ఆర్మీకి సంపూర్ణ మద్దతు జిల్లా కాంగ్రెస్ పక్షాన ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్రమంత్రి దామోదర్ రాజనర్సింహ మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలకు సంబంధించిన సమస్యలపై ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.



## కూలీల డబ్బులు చెల్లించాలి

### ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేష్

**కలంజ్యోతి, జగిత్యాల :** ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, ఒడిస్సా, జార్ఖండ్, మహారాష్ట్ర ల నుండి వచ్చిన వలస కార్మికులను మామిడి గుత్త దారులు తమ తోటలో మామిడి కాయలు తెంపుకున్నాక డబ్బులు ఇవ్వట్లేదని ఏఐటీయూసీ నాయకులు వెన్న మహేష్ పేర్కొన్నారు. శనివారం వెన్న మహేష్‌ను వలస కార్మికులు కలిసి ఈ విషయం గూర్చి విన్నవించగా స్పందించిన ఆయన మ్యాంగో మార్కెటును సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకొని గుత్తే దారులతో మాట్లాడినట్లు తెలిపారు. వేసవి కాలంలో శ్రమకోర్చి కుటుంబాల పోషణ కోసం ఇతర రాష్ట్రాల నుండి వచ్చి తోటలోని మామిడి కాయలు తెంపి కష్టపడ్డప్పటికి మాకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని కూలీలు ఆవేదన పడుతున్నారని తన దృష్టికి తీసుకువచ్చారాని, అలాగే డబ్బులు ఇవ్వకుండా శ్రమదోపిడీకి గురిచేస్తున్నారని చాలా పిర్యాదులు వచ్చాయాని మహేష్ తెలిపారు. శ్రమ దోపిడీకి పాల్పడుతున్నా గుత్తేద్దారులు వెంటనే కూలీల డబ్బులు చెల్లించాలని మహేష్ డిమాండ్ చేశారు. కార్మిక శాఖ అధికారులు మార్కెట్ ను సందర్శించి కార్మికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని, అలాగే పనులు చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న గుత్తే దారులు, మామిడి రైతులను చట్ట పరమైన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలనీ వెన్న మహేష్ డిమాండ్ చేశారు.

# గర్భాశయ క్యాన్సర్ నివారణకు కృషి చేయాలి

### ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గూడూరి హేమంత్



**కలంజ్యోతి, జగిత్యాల :** సర్వైకల్ క్యాన్సర్ ముక్త్ భారత్ కొరకు ప్రతి ఒక్కరం కంకణ బద్ధులై కృషి చేయాలని ఐఎంఏ జగిత్యాల శాఖ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్ పిలుపునిచ్చారు. స్థానిక ఐఎంఏ హాల్ లో ఐఎంఏ జగిత్యాల శాఖ, జగిత్యాల గైనకాలజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ గూడూరి హేమంత్ మాట్లాడుతూ.. జగిత్యాల ఐఎంఏ హాల్ లో ప్రతినెల రెండవ శనివారం రోజున సర్వైకల్ క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ను అందించే విధంగా చర్యలు చేపట్టామని జగిత్యాల ప్రజలు దాన్ని వినియోగించుకోవాలని కోరారు. గైనకాలజీ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సి.పద్మిని కుమార్ మాట్లాడుతూ.. దేశంలో క్యాన్సర్ మరణాలు రోజురోజుకు పెరుగుతున్న సందర్భంలో సర్వైకల్ క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ తీసుకోవాలని, దాని ద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యపడుతుందని పేర్కొన్నారు. 9 సంవత్సరాలు నిండిన నుండి 45 సంవత్సరాలు వచ్చేవరకు ప్రతి మహిళ ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చునని తెలిపారు. ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ జి శ్రీలత మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ ద్వారా ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని ప్రతి మహిళ ఈ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా క్యాన్సర్ నివారణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జగిత్యాల పట్టణ ప్రజల చైతన్యంతో ఈరోజు జరిగిన వ్యాక్సినేషన్ లో 52 మంది బాలికలు మరియు మహిళలు వ్యాక్సినేషన్ చేసుకోవడం జరిగిందని





తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఎం ఏ కోశాధికారి కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మ రాథోడ్ ,మరియు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



**కలంజ్యోతి, శేరిలింగంపల్లి :** శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగళూరు నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి మేఖల అగ్నిహోత్రి భరతనాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, , నవరస శ్లోకం దరువు వర్ణం, అంతఃపుర గీతం, ఆనంద నటన నాడినారు అంశాలను ప్రదర్శించి మెప్పించారు. శ్రీదేవి ప్రశాంత్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, బ్రహ్మాంజలి, అలరులు కురియగా, బ్రహ్మాంజలి, నారాయణతేయ్ , నమఃశివాయ , దశావతార శబ్దం, పలుకే బంగారమయేహ్నా, నీలమేఘ శరీర, అదివో అల్లదిగో, కొలువైతివరంగశాయి అంశాలను ఇరా, ఊర్మిళ, గీతికా, చార్వి, దియా, నైనికా, నిషిద్ధ, జాహ్నవి, అనూష, తనుశ్రీ , గోవర్ధిని మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు. కళాకారులందరికి జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు.





# కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు
# ఇంకెప్పుడు పూర్తి చేస్తారు?

## పనుల జాప్యంపై ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి

- భద్రాచలం రోడ్డు స్టేషన్ పనుల జాప్యంపై ఆగ్రహం
- త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

**కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం రోడ్డు కొత్తగూడెం రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న జాప్యంపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఎంపీ ఈ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వారి దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు. ఇకనైనా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీ వెంట మాజీ జడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, ఊకంటి గోపాల్ రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

---

# ఎన్‌సీసీ శిబిరంలో డపోడిల్స్ ప్రతిభ

- శిక్షణలో అద్భుతంగా రాణించినా 33 విద్యార్థులు
- విద్యార్థులకు అభినందించిన పాఠశాల కరస్పాండెంట్
- క్రమశిక్షణకు మారుపేరు ఎన్ సీసీ : డఫోడిల్స్ కరస్పాండెంట్ చింతల నరెందర్



**కలంజ్యోతి, నర్సంపేట :** క్రమశిక్షణకు మారుపేరు ఎన్ సీ సీ అని డఫోడిల్స్ (సీబీఎస్ఈ) పాఠశాల కరస్పాండెంట్ చింతల నరెందర్ అన్నారు. వరంగల్ గ్రీన్ వుడ్ హై స్కూల్ హసన్ పర్తిలో మే 1 నుంచి 10 వరకు ఏర్పాటు చేసిన 10 తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏటీసీ 1 ఎన్సీసీ శిక్షణా శిబిరంలో జేడీ - 19, జే డబ్ల్యూ - 14 మొత్తం 33 మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడమే కాక, శిక్షణలోనూ అద్భుతంగా రాణించారు. ఈ క్యాంప్‌లో విద్యార్థిని బి.వర్షిత రెండు విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి ఉత్తమ డ్రిల్, ఉత్తమ ప్రదర్శకురాలి అవార్డులను పొంది డఫోడిల్స్ పాఠశాల ప్రతిభను చాటి చెప్పారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నరెందర్ విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ.. నేడు విద్యార్థులు పుస్తకాలకే పరిమితమవకుండా సమాజంలో బాధ్యతాయుతంగా, నాయకత్వంతో కూడిన పౌరులుగా ఎదగాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఎన్ సీసీ ఒక అద్భుతమైన వేదికగా నిలుస్తోందన్నారు. కేవలం విద్యకే కాకుండా, వ్యక్తిత్వ వికాసానికి ఎన్సీసీ బలమైన ఆధారంగా నిలుస్తోంది. ఎన్సీసీ ద్వారా విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు సామాజిక సేవా భావన, శారీరక దారుఢ్యం పెంపొందించుకోవచన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ సాయి కీర్తన రోహిత్, ప్రధానోపాధ్యాయులు అజీముద్దీన్, ఉప ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రీటా, హెచ్ఆర్ విజయలక్ష్మి, శశికల, ఎన్ సీసీ కేర్ టెకర్ వెంకటరత్నం, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

---

# తల్లి లాలన..

నవ్వుతూ నవమాసాలు మోసి జన్మనిచ్చి
ప్రపంచానికి పరిచయం చేస్తుంది అమ్మ..
ఆరుబయట లాలపోస్తూ
వెలుగుకిరణాలని చూపిస్తుంది అమ్మ..
నా బంగారుకొండ, వెండికొండ అంటూ
కాటుక పెట్టి దిష్టి తీస్తుంది అమ్మ..
చక్కిలిగింతలు పెడుతూ మన చెక్కిల్లలో
నవ్వులు కురిపిస్తుంది అమ్మ..
తన ఎర్రని రక్తాన్ని తెల్లని పాలగా మార్చి
మన కడుపు నింపుతుంది అమ్మ..
జోల పాడి నిద్రపుచ్చి మన కునుకుకి
రామబంటులా కాపలా ఉంటుంది అమ్మ..
అరిపాదాలని ముద్దాడుతూ
తన అమ్మతనానికి మురిసిపోతుంది అమ్మ..
చంకనేసుకొని చందమామని చూపిస్తూ
గోరుముద్దలు పెడుతుంది అమ్మ..
ఎక్కెక్కి ఏడ్చినప్పుడు తన పైట
కొంగుతో కన్నీటికి ఆనకట్ట వేస్తుంది అమ్మ..
చీకటికి భయపడితే చిటికెన వేలు
పట్టుకొని నడిపిస్తుంది అమ్మ..
దాగుడుమూతలు ఆడిస్తూ మన భవిష్యత్తుకి
బంగారు బాటలు వేస్తుంది అమ్మ..
తను ఆరిపోతూ మనల్ని అందలం ఎక్కిస్తుంది అమ్మ..
నువ్వు మమ్మల్ని 'ప్రేమ ఓడి'లో లాలిస్తే..
మేము నిన్ను అనాధ గోడల్లో ఉంచుతున్నాము..
మేమే కదా నిజమైన ముద్దాయిలం
నువ్వు శిక్షించలేని బిడ్డలం..!!
పట్టుపడని నేరస్తులం..!!
ఎందుకంటే
నీది ప్రేమబంధం కాదు.. పేగు బంధం..!!
నువ్వు ఒక బంధాలమాలవి
అనుబంధాల హారానివి..!!
చిరునవ్వుల వానజల్లువి..!!
సేదతీరని నీటిచుక్కవి..!!
విశ్రాంతి లేని శ్రమజీవివి..!!
ఇంటింటా ఆనందపు రంగులు
వెదజల్లే ఇంద్రధనుస్సు అమ్మ..!!
రాయిని పూజించే మనసున్న
మాకు అమ్మని ప్రేమించే గుణము లేదాయే!!?
తన బిడ్డల్ని లాలిస్తూ.. ప్రేమిస్తూ..
అంతకుమించి క్షమిస్తూ ఉండే
'మాతృమూర్తులకు' శతకోటి వందనాలు..!

తుమ్మల
కల్పన రెడ్డి
96404 62142



కలంజ్యోతి
ఆదివారం 11.05.2025 General News



# అట్టహాసంగా ప్రారంభమైన మిస్ వరల్డ్ పోటీలు

ర్యాంప్ వాక్ చేసిన కంటెస్టర్లు
ఆకట్టుకున్న గుస్సాడీ, కొమ్ముకోయ ప్రదర్శనలు
మిస్ ఇండియా ర్యాంప్ వాక్‌కు మార్మోగిన స్టేడియం





**కలంజ్యోతి, హైదరాబాద్ :**
హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 72వ మిస్ వరల్డ్ పోటీలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మిస్ వరల్డ్ 2025 ప్రారంభం కార్యక్రమాలు నిర్వహించారు. అందెశ్రీ రచించిన 'జయ జయ హే తెలంగాణ' రాష్ట్ర గీతం ఆలాపనతో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభమయ్యాయి. 250 మంది కళాకారులతో కన్నుల పండుగగా నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ మిస్ వరల్డ్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి, మిస్ వరల్డ్ సీఈవో జూలియా మోర్లే, మిస్ వరల్డ్ క్రిష్టినా పిజ్కోవా హాజరయ్యారు.

**120 దేశాల కంటెస్టెంట్స్..**

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తోన్న మిస్ వరల్డ్ పోటీల్లో వెయ్యి మందికి పైగా గెస్టులు, టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రెటీలు పాల్గొన్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో 120 దేశాల కంటెస్టెంట్స్ పాల్గొనున్నారు. స్టేడియం, కంటెస్టెంట్‌లు బస చేస్తున్న ట్రైడెంట్ హోటల్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు.

**ఆకట్టుకొంటున్న సంప్రదాయ కార్యక్రమాలు..**

మిస్ వరల్డ్ ప్రారంభ కార్యక్రమంలో లాటిన్ అమెరికా దేశాల కంటెస్టెంట్స్ తమ దేశీయ ఆహార్యంతోపాటు సంస్కృతి, సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆఫ్రికన్ దేశాలకు చెందిన 22 కంటెస్టెంట్స్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. గుస్సాడీ, కొమ్ము కోయ కళాకారుల ప్రదర్శన విదేశీ అతిథులను ఆకర్షించింది.
మొదట అర్జెంటీనా కాంటెస్టెంట్ ర్యాంప్ పైకి వచ్చారు. ఆ తర్వాత కరేబియన్ లాటిన్ అమెరికా పోటీదారులు ర్యాంప్ పైకి వచ్చారు. రెండో రౌండ్ కంటెస్టెంట్స్ ఆఫ్రికా ఖండం నుంచి అంగోలాతో మొదలైంది.
తెలంగాణ సంప్రదాయ సాంస్కృతిక కళలు, పాశ్చాత్య కళల మేళవింపుగా మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం సాగింది. లంబాడా కళాకారులు డప్పు నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనకు అతిథులు, ఆహుతులు కరతాళ ధ్వనులు చేశారు.
మూడో రౌండ్ కంటెస్టెంట్స్ యూరప్ ఖండం నుంచి అల్బేనియా ప్రతినిధితో మొదలైంది. మొత్తం 32 దేశాలు యూరప్ నుంచి ప్రాతినిధ్యం వహించాయి. వారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రదర్శించారు.

**ఆసియా నుంచి 22 దేశాలు..**

ఆ తర్వాత జరిగిన ఒగ్గుడోలు కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ జెండాతో కళాకారులు అద్భుత ప్రదర్శన చేశారు. చివరి రౌండ్ కంటెస్టెంట్స్ ఆసియా ఓషియానియా నుంచి ర్యాంపు పైకి వచ్చారు. మొత్తం 22 దేశాలు నుంచి కంటెస్టెంట్స్ ప్రాతినిధ్యం వహించారు. వారి సంస్కృతి సాంప్రదాయాలను తమదైన శైలిలో ప్రదర్శించారు. మిస్ ఇండియా నందిని గుప్తా వచ్చినపుడు స్టేడియం కరతాళ ధ్వనులతో మారుమోగింది.

**కట్టుదిట్టమైన భద్రత..**

అత్యంత కట్టుదిట్టమైన భద్రతా మధ్య హైదరాబాద్ లో 72వ మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణ జరూర్ ఆనా' నినాదంతో నిర్వహిస్తున్న ఈ పోటీల ప్రారంభోత్సవాన్ని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. దాదాపు 120 దేశాల ప్రతినిధులు ఇప్పటికే నగరానికి చేరుకుని రిహార్సల్స్ పూర్తి చేశారు. భారత్ నుంచి నందిని గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**13న హెరిటేజ్ వాక్..**

మిస్ వరల్డ్ 2025 కంటెస్టెంట్స్ వరంగల్, పోచంపల్లి, బుద్ధవనం, యాదగిరిగుట్ట, మహబూబ్‌నగర్ ప్రాంతాల సాంస్కృతిక, చారిత్రాత్మక ప్రాంతాలను సందర్శించనున్నారు. ఈ నెల 13న చార్మినార్, లాడ్ బజార్ వద్ద హెరిటేజ్ వాక్ లో సుందరీమణులు పాల్గొంటారు.

**మే 31న హైటెక్స్ వేదికగా ఫైనల్..**

మే 31న హైటెక్స్ వేదికగా మిస్ వరల్డ్ 2025 ఫైనల్ పోటీ నిర్వహించనున్నారు. తెలంగాణ సాంస్కృతిక, సంప్రదాయాల మేళవింపుగా మూడు వారాల పాటు మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరగనున్నాయి.

# అనసూయ వయ్యారం

యాంకర్ అనసూయ తన యాంకరింగ్ తో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్నది. ఆ తర్వాత సుకుమార్ డైరెక్షన్‌లో రామ్ చరణ్ హీరోగా నటించిన 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్తగా నటించే ఛాన్స్ లభించింది. ఆ మూవీతో ఈ అమ్మడు గ్రాఫ్ ఒక్కసారిగా చేంజ్ అయింది. దాంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా కొన్ని చిత్రాల్లో మెయిన్ లీడ్ కూడా పోషించింది. అలాగే మరోసారి సుకుమార్ దర్శకత్వంలో బన్నీ హీరోగా వచ్చిన 'పుష్ప' మూవీలో సునీల్ భార్య దాక్షాయణిగా నటించి మెప్పించింది. తన నటనతో అందరికీ షాక్‌కు గురిచేసింది.  ఓ పక్కా సినిమాలతో బిజీ ఉన్నప్పటికీ నిత్యం సోషల్ మీడియాలోనూ యాక్టీవ్ గా ఉంటూ తన హాట్ హాట్ ఫొజులతో కుర్రకారుకు హీట్ పుట్టిస్తోంది. ఈ క్రమంలో ఈ బ్యూటీ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా అనసూయ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. అందులో గవ్వలతో డిజైన్ చేసిన గుజరాతీ డ్రెస్ వేసుకున్నది. అలాగే నడుముతో పాటు బొడ్డు కూడా కనిపించేలా బోల్డ్ షో చేసింది. దాంతో ఈ పిక్స్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారాయి.

